# బలగం TV
# BALAGAM

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 01 ఆగస్టు 2025 | www.balagamtv.com | పేజీలు 4


## రెండు నిమిషాల్లోనే కుల ధ్రువీకరణ పత్రం

### ప్రభుత్వం కీలక నిర్ణయం... మీసేవా ద్వారా తక్షణమే సర్టిఫికెట్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర ప్రజలకు మరింత సౌకర్యం కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై కుల ధ్రువీకరణ పత్రాన్ని మీసేవా కేంద్రాల ద్వారా కేవలం రెండు నిమిషాల్లో పొందేలా అవకాశం కల్పించింది. ఇప్పటికే కుల ధ్రువీకరణ పత్రం పొందిన వారు, తిరిగి కొత్తదిగా అవసరమైనప్పుడు వారం నుంచి 15 రోజులు వేచి ఉండాల్సిన పరిస్థితి ఇక ఉండదని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం అవసరం ఉన్నవారు నేరుగా మీసేవా కేంద్రానికి వెళ్లి, రూ. 45 రుసుము చెల్లించి, ఆధార్ నంబర్ తెలిపితే సరిపోతుంది. ముందుగా తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రంపై మీసేవా నంబర్ ఉంటే, అదే ఆధారంగా మరల సర్టిఫికెట్‌ను ప్రింట్ తీసుకోవచ్చు. అయితే, ఈ విధానం ఎస్సీ హిందూ సామాజిక వర్గానికి మాత్రం వర్తించదని ఈడీఎం దేవేందర్ తెలిపారు.

మిగితా 2వ పేజీలో




## సహకార రంగానికి మద్దతు

- ఎన్‌సీడీసీకి రూ.2వేల కోట్ల గ్రాంటు
- పీఎంకేఎస్‌వై వ్యయం రూ.6,520 కోట్లకు పెంపు
- కేంద్ర మంత్రివర్గం ఆమోదం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో సహకార రంగ అభివృద్ధికి కీలకంగా భావిస్తున్న రెండు ప్రధాన నిర్ణయాలు వెలువడ్డాయి. జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ)కు రూ.2,000 కోట్ల నిధులను నాలుగేళ్లకాలంలో మంజూరు చేయాలని కేంద్రం ఆమోదం తెలిపింది. అలాగే ప్రధాన్ మంత్రి కిసాన్ సంపద యోజన (%ూవీఖు%)కు రూ.1,920 కోట్ల అదనపు నిధులతో మొత్తంగా రూ.6,520 కోట్ల వ్యయంతో కొనసాగింపునకు ఆమోదం తెలిపింది.

**ఎన్సీడీసీకి నాలుగేళ్లలో రూ.2,000 కోట్లు**

2025-26 నుంచి 2028-29 వరకూ సంవత్సరానికి రూ.500 కోట్లు చొప్పున మొత్తం రూ.2,000 కోట్లను కేంద్ర ప్రభుత్వం గ్రాంట్‌గా అందించనుంది. ఈ మద్దతుతో ఎన్సీడీసీ ఓపెన్ మార్కెట్ ద్వారా రూ.20,000 కోట్ల వరకు రుణాలు సమీకరించి, దేశవ్యాప్తంగా ఉన్న సహకార సంఘాలకు రుణాలుగా ఇవ్వనుంది. ఈ నిధులతో దేశంలో డెయిరీ, పశుపాలన, మత్స్య, షుగర్, చేనేత, ఫుడ్ ప్రాసెసింగ్, నిల్వ కేంద్రాలు, శీతలీకరణ గోదాములు, కార్మిక, మహిళల సహకార సంఘాల్లకు ప్రాజెక్టుల ఏర్పాటు, విస్తరణ, పని మూలధన అవసరాల కోసం రుణాలిచ్చే అవకాశముంది. దేశవ్యాప్తంగా 13,288 సహకార సంఘాలకు చెందిన 2.9 కోట్ల మంది సభ్యులు లబ్ధి పొందే అవకాశం ఉందని ప్రభుత్వం వెల్లడించింది.

**రుణాలపై ప్రత్యేక మార్గదర్శకాలు**

ఎన్‌సీడీసీ నేరుగా లేదా రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా సహకార సంఘాలకు రుణాలు అందిస్తుంది.

ప్రాజెక్టుల పర్యవేక్షణ, అమలు, రికవరీ బాధ్యతను ఎన్సీడీసీ నిర్వర్తిస్తుంది.

దీర్ఘకాలిక రుణాల ద్వారా ప్రాజెక్టుల విస్తరణ, టెక్నాలజీ అప్‌గ్రేడ్‌కు ఉపయోగపడనుంది.

**పీఎం కిసాన్ సంపద యోజనకు కొనసాగింపు**

15వ ఆర్థిక సంఘం కాలంలో (2021%-%22 నుంచి 2025%-%26 వరకూ) ప్రధాన్ మంత్రి కిసాన్ సంపద యోజనకు రూ.1,920 కోట్ల అదనపు నిధులతో మొత్తం వ్యయాన్ని రూ.6,520 కోట్లకు పెంచింది. ఇందులో భాగంగా 50 మల్టీ ప్రొడక్ట్ ఫుడ్ ఇరాడియేషన్ యూనిట్లు, 100 %చీూదీూ% గుర్తింపు పొందిన ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఈ యూనిట్ల ద్వారా ప్రతి సంవత్సరం 20%-%30 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఏర్పడనుందని అంచనా. ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లు సురక్షిత ఆహార సరఫరాకు మద్దతు ఇస్తాయని ప్రభుత్వం పేర్కొంది.

**గ్రామీణ అభివృద్ధికి తోడుగా సహకార రంగం**

ప్రస్తుతం దేశంలో 8.25 లక్షలకుపైగా సహకార సంఘాలుండగా, వీటికి 29 కోట్ల మంది సభ్యులున్నారు. వీరిలో 94 శాతం మంది రైతులే. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, మౌలిక వసతుల అభివృద్ధికి సహకార రంగం కీలకంగా మారిందని ప్రభుత్వం పేర్కొంది.

## బీఆర్ఎస్ ముఖ్య నేతలతో కేసీఆర్ భేటీ



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సిద్ధిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో పార్టీ ముఖ్యనేతలు హరీశ్‌రావు, కేటీఆర్, జగదీశ్‌రెడ్డి తో గురువారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులపై ఆయన ప్రధానంగా చర్చించినట్టు తెలు స్తోంది. ముఖ్యంగా ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీం కోర్టులో తుది తీర్పు వెలువడిన నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత సంతరించు కుంది. అంతేకాక, గురువారం నాటితో పి.జస్టిస్ చంద్రఘోష్ కాళేశ్వరం కమిషన్ గడువు ముగిసి.. ప్రభుత్వానికి రిపోర్టు అందించ డంతో వారి సమావేశంలో దీనిపై కూడా చర్చ జరిగినట్టు సమాచారం. మేడిగడ్డతో పాటు ఇతర ప్రాజెక్టుల్లో లోపాలకు తామే కారణమని కాళేశ్వరం కమిషన్ నివేదిక ఇస్తే.. ప్రభు త్వంపై ఎలా కౌంటర్ అటాక్ చేయాలనే దానిపై సమాలో చనలు చేసినట్టు తెలు స్తోంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు పార్టీ సన్నద్ధత, అభ్యర్థి ఎంపికపై హరీశ్ రావు, జగదీశ్ రెడ్డి, కేటీఆర్ తమ అభిప్రాయాలను కేసీఆర్‌తో పంచుకున్నట్టు తెలుస్తోంది. చివరగా స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీ శ్రేణులను యాక్టివ్ చేయడం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై కూడా చర్చించినట్టు సమాచారం.

## ప్రజలు మా వెంట ఉండాలి



- 6న ఢిల్లీలో ధర్నా
- అన్నీ హామీలు అమలు చేస్తాం
- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్
- వికారాబాద్ జిల్లా పరిగిలో జనహిత పాదయాత్ర ప్రారంభం
- పాల్గొన్న టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు శ్రీధర్‌బాబు, సురేఖ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రజలకు చేరువయ్యేందుకే తాము పాదయాత్ర చేపడుతున్నట్టు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ తెలిపారు. 'జై బాబు, జై భీమ్, జై సమ్మిదాన్' కార్యక్రమంలో 'జనహిత' పాదయాత్రను వికారాబాద్ జిల్లా పరిగి మండలం రాఘవపూర్‌లో గురువారం ఆమె ప్రారంభించారు. ఈ పాదయాత్రలో టీపీసీసీ మహేష్ కుమార్‌గౌడ్, మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. రాఘవపూర్ నుంచి పరిగి వరకు ఈ పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మీనాక్షి నటరాజన్ మాట్లాడారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం పోరాడేందుకు ఈ నెల 6వ తేదీన ఢిల్లీలో ధర్నా చేపడుతామని, ఈ పోరాటంలో ప్రజలందరూ తమ వెంట ఉండాలని, ఎప్పుడైతే పోరాటం ప్రజా ఆందోళనగా మారుతుందో అప్పుడు విజయం సాధిస్తామని తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఎంతో ప్రేమతో, కష్టపడి పాదయాత్రకు వచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాదయాత్ర అనే ఆచారం చాలా పురాతనమైనదని, దేశంలోని మసీదులు, దేవాలయాలు వంటి పవిత్ర స్థలాలకు వెళ్ళినప్పుడు నడుచుకుంటూ వెళ్తామని అన్నారు. 3,500 కిలోమీటర్ల పాదయాత్ర చేసి రాహుల్ గాంధీ తమకు కొత్త దారి చూపించారని తెలిపారు. ఆయన చూపించిన దారిలో తామూ నడుచుకుంటూ ప్రజల మధ్యకు వచ్చామని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. రాహుల్ గాంధీ ఎప్పుడు మాట్లాడిన తెలంగాణను మోడల్‌గా చెప్తారని

మిగితా 2వ పేజీలో

# మూడు నెలల్లో తేల్చాలి

- పార్టీ మారిన ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోండి
- స్పీకర్‌కు సుప్రీంకోర్టు ఆదేశం
- బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన పది మంది ఎమ్మెల్యేలపై మూడు నెలల్లో తేల్చాలని స్పష్టమైన డెడ్‌లైన్
- హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పును తోసిపుచ్చిన సుప్రీం





**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల భవితవ్యంపై నెలకొన్న ఉత్కంఠకు సుప్రీంకోర్టు ముగింపు పలికేలా కీలక ఆదేశాలు జారీ చేసింది. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి తరువాత అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన పదిమంది ఎమ్మెల్యేలపై అనర్హత అంశంపై స్పీకర్ తుది నిర్ణయం తీసుకోవాలని, దానికి మూడు నెలల గడువు పెట్టింది.

ఎన్నికల నేపథ్యంలో మారిన రాజకీయం:

2023లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ టికెట్‌పై గెలిచిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కాలే యాదయ్య, ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, సంజయ్ కుమార్ %-% ఎన్నికల తరువాత కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇలాంటి చర్యలు ప్రజా నైతికతకు, పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టానికి విరుద్ధమంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, వివేకానంద, పాడి కౌశిక్ రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అసెంబ్లీ స్పీకర్ స్పందించకపోవడాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు.

ఈ కేసు విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ధర్మాసనం "మూడు నెలల లోగా ఈ అనర్హత పిటిషన్లపై తుది నిర్ణయం తీసుకోవాలి" అంటూ స్పీకర్‌ను ఆదేశించింది. ఇదే సమయంలో ఈ అంశంపై స్పీకర్ ఆలస్యంగా స్పందించడం రాజ్యాంగ ప్రమాణాలకు విరుద్ధమని పరోక్షంగా విమర్శించింది. ఈ తీర్పుతో తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ అయిన పార్టీ ఫిరాయింపు వ్యవహారంపై స్పష్టత ఏర్పడే అవకాశం కనిపిస్తోంది. స్పీకర్ నిర్ణయాన్ని బట్టి ఈ ఎమ్మెల్యేల భవితవ్యంపై తుది ముహూర్తం పడనుంది.

అలాగే ఈ వ్యవహారంలో గతేడాది నవంబర్ 22న రాష్ట్ర హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును పక్కన పెట్టింది. మొత్తం 'పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేల పై అనర్హత చర్యలను వీలైనంత త్వరగా లేదా మూడు నెలల్లోపు నిర్ణయించాలి. ఏ ఎమ్మెల్యే విచారణను కొనసాగించడానికి అనుమతించొద్దు. అలా చేస్తే స్పీకర్ ప్రతికూల నిర్ణయాలు తీసుకోవచ్చు' అని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే పార్టీ మారిన వారిపై న్యాయస్థానమే అనర్హత వేటు వేయాలన్న పిటిషనర్ల విజ్ఞప్తిని కోర్టు తిరస్కరించింది.

ఈ పిటిషన్లు దాఖలైన తరువాత దాదాపు ఏడు నెలల్లో తొమ్మిది సార్లు సుప్రీంకోర్టు విచారణ జరిపింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి ముందు నుంచి ఈ పిటిషన్లపై విచారణ చేపట్టగా, పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాదులు ఆర్యమ సుందరం, దామా శేషాద్రి నాయుడు, మోహిత్ రావు, స్పీకర్, ప్రతివాదుల తరపు సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహిత్గి, అభిషేక్ మను సింఘ్వి, రవి శంకర్ జంధ్యాల, గౌరవ్ అగర్వాల్, నిరంజన్ రెడ్డి పలువురు వాదనలు వినిపించారు. కాగా... సుదీర్ఘ వాదనల తరువాత ఈ ఏడాది ఏప్రిల్ 3న సుప్రీంకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. ప్రస్తుతం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం గురువారం 74 పేజీల తీర్పును వెలువరించింది.

ఈ కేసులో స్పీకర్‌కు ఆదేశాలు జారీ చేయడంలో వైఫల్యం రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ లక్ష్యాన్నే నీరుగార్చుతుందని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయి అన్నారు. రాజకీయ ఫిరాయింపులను అరికట్టకపోతే, ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే శక్తి దానికి ఉందని పేర్కొన్నారు. 'ఇప్పుడు మేం ఏ ఆదేశాలు జారీ చేయకపోతే... 'ఆపరేషన్ సక్సెస్-పేషెంట్ డైడ్' అన్నట్టుగా ఉంటుంది. ఇది స్పీకర్ ప్రస్తుత తీరును పునరావృతం చేయడానికి దోహదపడ్డట్టే' అని సీజేఐ అభిప్రాయపడ్డారు. పదో షెడ్యూల్ కింద స్పీకర్ ట్రిబ్యూనల్‌గా పని చేస్తున్నప్పటికీ, ఎటువంటి 'కానిస్టిట్యూషనల్ ఇమ్యూనిటీ' ని పొందలేరని స్పష్టం చేశారు.

మిగితా 2వ పేజీలో

## భూముల పరిరక్షణకు అత్యవసర చర్యలు



- అన్యాక్రాంతం అయిన భూములను యుద్ధప్రాతిపదికన స్వాధీనం
- కోర్టు కేసుల పరిష్కారానికి ప్రత్యేక సీనియర్ న్యాయవాది నియామకం
- నీటి పారుదల శాఖ భూములలో సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటుకు పరిశీలన
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర వ్యాప్తంగా నీటిపారుదల శాఖా భూముల పరిరక్షణకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. వందల కోట్ల రూపాయల విలువ చేసే భూములు కబ్జాకు గురైన పక్షంలో ఎంత మాత్రం ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఆక్రమణలకు గురైన భూములను యుద్ధ ప్రాతిపదికన స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆ భూముల చుట్టూ కంచె ఏర్పాటు చేసే విదంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నీటిపారుదల శాఖా భూముల పరిరక్షణలో బాగంగా గురువారం మధ్యాహ్నం డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో హైడ్రా, ఇరిగేషన్ అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, హైడ్రా కమిషనర్ ఏ.వి రంగనాథ్, ఆర్ నస్త్ర%ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు, ఇ. ఎన్.సి అఫ్జల్ హుస్సేన్, ఇ.ఎన్.సి అడ్మిన్ రమేష్ బాబు వాలంతరి డైరెక్టర్ జెనరల్ అనిత, హైడ్రా ఎస్.పి అశోక్ తదితరులు ఈ సమీక్ష లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రధానంగా హైదరాబాద్ లోని గండిపేట, రాజేంద్రనగర్ పరిధిలో ఉన్న గండిపేట సమీపంలోని హిమాయత్ సాగర్, కిస్మత్ పుర, కిస్మత్ పుర లతో పాటు రాజేంద్రనగర్ పరిధిలోని వాలంతరి, టి.జి.ఇ.ఆర్.ఎల్ కు చెందిన 426-30 ఎకరాలకు గాను 131-31ఎకరాలు కబ్జాకు గురైనట్లు గుర్తించామన్నారు. అందులో ఐ.టి.ఐ.ఆర్ అధీనం లో ఉన్న 81.26 ఎకరాల అంశం కోర్టు పరిధిలో ఉందన్నారు. 50.13 ఎకరాలు ఆక్రమణకు గురైందని ఆయన తెలిపారు. కాగా ఈ ఆక్రమణ లపై జిల్లా కోర్టులో 20 కేసులు పెండింగ్ లో ఉండగా హైకోర్టు లో మరో 2 కేసులు నడుస్తున్నాయన్నారు. భూములను పరిరక్షిండంలో ఎటువంటి న్యాయపరమైన చిక్కులు ఏర్పడ్డా ఎదుర్కొనేందుకు నీటిపారుదల శాఖా

మిగితా 2వ పేజీలో

## ప్రభుత్వానికి కాళేశ్వరం కమిషన్ అందజేత



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ప్రభుత్వానికి భారీ ప్రాజెక్టుగా భావించబడిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బారేజుల ప్రణాళిక, నిర్మాణం, నిర్వహణలో తలెత్తిన అనుమానాలపై ఏర్పాటు చేసిన న్యాయమూర్తి పినాకీ చంద్ర ఘోష్ విచారణ కమిషన్ తన పూర్తి నివేదికను ప్రభుత్వానికి గురువారం అందజేసింది. ఈ నివేదికను కమిషన్ చైర్మన్ జస్టిస్ పినాకీ చంద్ర ఘోష్, రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు అందించారు. ఈ నివేదికను అనంతరం ముఖ్య కార్యదర్శి కె. రామకృష్ణారావుకు అప్పగించే అవకాశం ఉంది.

**15 నెలల విచారణలో 115 మంది సాక్షుల పరీక్ష**

2024 మార్చిలో ఏర్పాటు చేసిన ఈ కమిషన్ మే నెల నుంచి పనిచేయడం ప్రారంభించింది. మొత్తం 15 నెలల కాలంలో కమిషన్ బారేజులను ప్రత్యక్షంగా పరిశీలించి, ఇంజినీర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు సహా మొత్తం 115 మంది సాక్షులను విచారించింది. వీరిలో మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు,

మిగితా 2వ పేజీలో



## సీఎం రేవంత్‌పై రెండు కేసులు కొట్టివేత

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సీఎం రేవంత్ రెడ్డికి భారీ ఊరట లభించింది. ఆయనపై ఉన్న రెండు కేసులను ప్రజాప్రతినిధుల కోర్టు కొట్టివేసింది. నల్గొండ 2 టౌన్ పోలీస్ స్టేషన్, కౌడిపల్లి పీఎస్‌లో నమోదైన కేసులను కొట్టివేస్తూ తీర్పునిచ్చింది. రేవంత్ రెడ్డి టీపీసీసీ చీఫ్ గా ఉన్న సమయంలో ఆయనపై రెండు కేసులు నమోదయ్యాయి. 2021లో కాంగ్రెస్ చేపట్టిన ఆందోళనలు, నిరసనల సమయంలో ఈ కేసులు నమోదు చేశారు. ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేస్తూ ర్యాలీలు నిర్వహించగా.. ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించారని, అనుమతులు లేకుండా బహిరంగ సభలు నిర్వహించారని ఫిర్యాదులు అందాయి. ఈ కేసుకు సంబంధించి గత నెల 26న నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో సీఎం రేవంత్ నేరుగా విచారణకు హాజరయ్యారు. ప్రభుత్వ వాదనలతో పాటు రేవంత్ తరపు న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం కోర్టు కేసును 31వ తేదీకి వాయిదా వేయగా తగిన ఆధారాలు సమర్పించడంతో రెండు కేసులను న్యాయస్థానం కొట్టివేసింది.

## ఉపరాష్ట్రపతి ఎన్నికల కోసం ఎలక్టోరల్ కాలేజ్ సిద్ధం : ఈసీ

- త్వరలో నోటిఫికేషన్ విడుదల చేసే సూచనలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**




ఉపరాష్ట్రపతి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) పూర్తి చేసింది. ఇందుకు సంబంధించి ఎలక్టోరల్ కాలేజ్ సిద్ధంగా ఉందని ఈసీ స్పష్టం చేసింది. ఈ మేరకు సంస్థ తన అధికారిక ఎక్స్ (పూర్వం ట్విట్టర్) ఖాతా ద్వారా ఒక ప్రకటన విడుదల చేసింది. ఎలక్టోరల్ కాలేజ్ జాబితాలో రాజ్యసభ, లోక్‌సభ సభ్యుల వివరాలు, వారు ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వివరాలను ఆల్ఫబెటికల్ క్రమంలో పొందుపరిచినట్లు ఈసీ వెల్లడించింది. సంబంధిత జాబితాను త్వరలో విడుదల చేయనున్న నోటిఫికేషన్ అనంతరం, ఈసీ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్న కౌంటర్ ద్వారా కొనుగోలు చేయవచ్చని వెల్లడించింది.

**ఆర్టికల్ 66 ప్రకారం ఎన్నికలు**

ఉపరాష్ట్రపతి ఎన్నికలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 66 (1) ప్రకారం నిర్వహించబడతాయి. ఎన్నికైన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, నామినేటెడ్ రాజ్యసభ సభ్యులు కలిసిన ఎలక్టోరల్ కాలేజ్ ద్వారా ఉపరాష్ట్రపతి ఎన్నిక జరుగుతుంది. ఉపరాష్ట్రపతి పదవి ఖాళీ అయితే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించి కొత్త ఉపరాష్ట్రపతిని నియమించాల్సి ఉంటుంది. ఇటీవల ఉపరాష్ట్రపతిగా ఉన్న జగదీప్ ధన్‌ఖడ్ అనారోగ్య కారణాలతో తన పదవికి రాజీనామా చేశారు. అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆ రాజీనామాకు ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. దీంతో ఖాళీ అయిన ఉపరాష్ట్రపతి పదవిని భర్తీ చేసేందుకు ఈసీ ముందంజ వేసింది. ఇందులో భాగంగా ఎలక్టోరల్ కాలేజ్ ఏర్పాటును పూర్తిచేసింది.

# ఉప ఎన్నికలు ఖాయం

- **ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ తక్షణ నిర్ణయం తీసుకోవాలి**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**బలగం టీవి, హైదరాబాద్**



సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ పార్టీ మారిన ఎమ్మెల్యేలపై స్పీకర్ వెంటనే అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు (కేటీఆర్) డిమాండ్ చేశారు. ఫిరాయింపులకు అడ్డుగా స్పీకర్ పదవిని ఉపయోగించిన కాంగ్రెస్ పార్టీపై సుప్రీంకోర్టు తీర్పు చెంపదెబ్బలాంటిదని వ్యాఖ్యానించారు.

పార్టీ మారిన ప్రజాప్రతినిధులు అడ్డదారులు ఎంచుకున్నా, భారత ప్రజాస్వామ్య వ్యవస్థను నిలబెట్టిన తీర్పుకు కేటీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. కోర్టులను తప్పుదోవ పట్టించాలన్న కాంగ్రెస్ కుట్రలు విఫలమయ్యాయని, ధర్మం విజయం సాధించిందని పేర్కొన్నారు.

**రాహుల్ నిజాయితీ ఎక్కడ?**

"పాంచ్ న్యాయ్" అంటూ రాహుల్ గాంధీ మాట్లాడిన మాటలకు ఇప్పుడు ప్రాక్టికల్ పరీక్ష వుందని కేటీఆర్ అన్నారు. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని తిరిగే రాహుల్ గాంధీ, సుప్రీంకోర్టు తీర్పును అమలు చేసి తన చిత్తశుద్ధిని చూపించాలన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు స్పష్టంగా ఉన్న నేపథ్యంలో, పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలపై మరింత విచారణ అవసరం లేదని పేర్కొన్నారు. అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఈ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ తక్షణం అనర్హత వేటు వేయాలన్నారు.

**ఉప ఎన్నికలకు సిద్ధమవ్వండి కార్యకర్తలకు కేటీఆర్ పిలుపు**

పార్టీ మారిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో వచ్చే మూడు నెలల్లో ఉప ఎన్నికలు జరగొచ్చని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. ఈ సమయంలో పార్టీ పట్ల అండగా నిలిచిన కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. "గెలుపు కోసం బీఆర్ఎస్ సిద్ధంగా ఉంది... ఇప్పటి నుంచే పని చేయండి" అని కార్యకర్తలను ఉద్దేశించి పిలుపునిచ్చారు.

# రెండు నిమిషాల్లోనే కుల ధ్రువీకరణ పత్రం

**(మొదటి పేజీ తరువాయి)**

అంతకుముందు కుల ధ్రువీకరణ పత్రాన్ని తిరిగి పొందాలంటే అప్లికేషన్ ఫారం, ఆధార్ కార్డు, సంగం సర్టిఫికెట్, పాత కుల ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, అఫిడవిట్ వంటి పత్రాలు సమర్పించి మీసేవా కేంద్రంలో చలాన్ కట్టి దరఖాస్తు చేయాల్సి వచ్చేది. తర్వాత వారం నుంచి 15 రోజుల సమయంలో కొత్త సర్టిఫికెట్ వచ్చేది. ఇప్పుడు ఈ సంక్లిష్ట ప్రక్రియకు చెక్ పెట్టింది ప్రభుత్వం.

**మీసేవా పరిధిలోకి మరిన్ని సేవలు**

ఈ సందర్భంగా మీసేవా ద్వారా అందించే సేవల పరిధిని ప్రభుత్వం విస్తరించింది. రెవెన్యూ, అటవీ, సంక్షేమ శాఖలకు సంబంధించిన అనేక సేవలను ఇప్పుడు మీసేవా ద్వారా పొందవచ్చు. ముఖ్యంగా గ్యాప్ సర్టిఫికేట్, పౌరుని పేరు మార్పు, స్థానికత, మైనార్టీ, క్రిమిలేయర్, నాన్ క్రిమిలేయర్, వన్యప్రాణుల దాడికి పరిహారం, తదితర సేవలతో పాటు హిందూ మ్యారేజ్ సర్టిఫికేట్, నాన్ అగ్రికల్చర్ మార్కెట్ విలువ సర్టిఫికేట్, పాన్ కార్డు సవరణ, ఇసుక బుకింగ్ సేవలు కూడా మీసేవాలో అందుబాటులోకి వచ్చాయని అధికారులు తెలిపారు.

# ప్రజలు మా వెంట ఉండాలి

**(మొదటి పేజీ తరువాయి)**

తెలిపారు. రాబోయే రోజుల్లో పేదలను అభివృద్ధి చేసే విధంగా ముందుకు కొనసాగుతామని అన్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది కాబట్టి గ్రామస్థాయిలో కూడా పార్టీ అధికారంలో ఉంటే మరింత అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. పాదయాత్ర అనేది కాంగ్రెస్ పార్టీలో నరానరాల జీర్ణించుకుపోయిన అంశమని అన్నారు. పాదయాత్ర ద్వారానే దేశాన్ని చూడగలిగామని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నో ఉద్యమాలు, ఎన్నో యాత్రలు చేశారని గుర్తు చేశారు. ఆరు గ్యారంటీలు ఇచ్చినందుకు ప్రజలు పార్టీని నమ్మారని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పదేండ్ల కాలంలో ఏడున్నర లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాళా తీయించారని ఆరోపించారు. బీజేపీ మెడలు వంచి బీసీ రిజర్వేషన్స్ తెచ్చుకునే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో 6న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తామని తెలిపారు. నిజాం ప్రభువు వదిలేసిన లక్షల కోట్ల భూములను కేసీఆర్ ప్రయివేట్ వ్యక్తులకు అమ్ముకున్నారని విమర్శించారు. ఈ యాత్ర నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.

# ప్రభుత్వానికి కాళేశ్వరం కమిషన్ అందజేత

**(మొదటి పేజీ తరువాయి)**

మాజీ మంత్రులు టి. హరీశ్ రావు, ఈటల రాజేందర్ ఉన్నారు. కేసీఆర్‌ను వీడియో రికార్డింగ్ ద్వారా విచారించగా, మిగిలిన వారిని తెరవేదికపై విచారించారని సమాచారం.

2023 అక్టోబర్‌లో మేడిగడ్డ బారేజీలో భాగమైన ఏడు వంతెన కాలమ్‌లు క్షీణించి కొట్టుకుపోయిన ఘటనపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ విచారణ చేపట్టింది. ఆ తరువాత 2023 డిసెంబరులో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, తొలుత విజిలెన్స్ విచారణను ఆదేశించి, అనంతరం అసెంబ్లీలో ముఖ్యమంత్రి అ. రేవంత్ రెడ్డి ప్రకటనతో విచారణ కమిషన్ ఏర్పాటు చేసింది. ప్రాథమిక నివేదికలోనే బారేజీల ప్రణాళిక నుండి నిర్వహణ వరకు అన్ని అంశాల్లో లోపాలున్నాయని, ముఖ్యంగా షీట్ పైల్స్ స్థానంలో సీకంట్ పైల్స్ వినియోగం, భౌగోళిక పరీక్షలు లేకుండానే నిర్మాణం ప్రారంభించడం వంటి అంశాలపై తీవ్రంగా విమర్శించింది.

ఎన్‌డీఎస్ఏ విడుదల చేసిన తుది నివేదికలో నష్టపోయిన బ్లాక్‌ను పూర్తిగా తిరిగి నిర్మించాలి, పునరుద్ధరణకు ముందు ప్రత్యేక భౌగోళిక పరీక్షలు నిర్వహించాలి అని సిఫార్సు చేసింది. అదే విధంగా విజిలెన్స్ నివేదికలో కూడా ఇంజినీర్ల నిర్లక్ష్యం, సాంకేతిక ప్రమాణాల పాటించకపోవడం వంటి అంశాలపై పేర్కొంటూ చర్యలు తీసుకోవాలంటూ ప్రభుత్వం ను సూచించింది. కమిషన్ నివేదికకు అనుసంధానంగా ప్రభుత్వ చర్యలపై స్పష్టత వచ్చే అవకాశముంది.

## మాలేగావ్ పేలుళ్ల కేసులో ఏడుగురిని నిర్దోషులుగా ప్రకటించిన కోర్టు

**బలగం టీవి, ముంబై**

2008 మాలేగావ్ పేలుళ్ల కేసులో ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు కీలక తీర్పు వెల్లడించింది. దాదాపు 17 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ కేసులో నిందితులుగా ఉన్న బిజెపి మాజీ ఎంపి ప్రజ్ఞా సింగ్ ఠాకూర్, లెఫ్టినెంట్ కల్నల్ ప్రసాద్ పురోహిత్ సహా ఏడుగురు నిందితులను ముంబైలోని ఎన్ఐఏ కోర్టు గురువారం నిర్దోషులుగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఏడుగురు నిందితులు నిర్దోషులేనని చెప్పింది. నిందితులకు వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాలు లేవని.. పేలుడులో వాడిన బైక్ సాధ్వి ప్రజ్ఞాకు చెందినదిగా నిరూపించలేకపోయారని కోర్టు పేర్కొంది. ఈ కేసులో ప్రజ్ఞా ఠాకూర్, లెఫ్టినెంట్ కల్నల్ పురోహిత్ తోపాటు మేజర్ (రిటైర్డ్) రమేష్ ఉపాధ్యాయ్, అజయ్ రహిర్కర్, సుధాకర్ ద్వివేది, సుధాకర్ చతుర్వేది, సమీర్ కులకర్ణి నిందితులుగా ఉన్నారు.సెప్టెంబర్ 29, 2008న ముంబై నుండి 200 కి.మీ దూరంలో ఉన్న మాలేగావ్ పట్టణంలోని ఒక మసీదు సమీపంలో మోటార్ సైకిల్‌కు బాంబ్ అమర్చి ఈ ఘటనకు పాల్పడ్డారు. ఈ ఘటనలో ఆరుగురు మరణించగా, 100 మందికి పైగా గాయపడ్డారు. ఈ కేసును మొదట దర్యాప్తు చేసిన మహారాష్ట్ర ఉగ్రవాద నిరోధక దళం 2011లో ఎన్ఐఏకి బదిలీ చేసింది. దీంతో దర్యాప్తు నిర్వహించిన జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ).. ఏడుగురు నిందితులపై అభియోగాలు మోపిన తర్వాత 2018లో ఈ కేసు విచారణ ప్రారంభమైంది.

## సిగాచి ఘటనలో ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

**బలగం టీవి, హైదరాబాద్**

పటాన్ చెరువులోని పాశమైలారం పారిశ్రామికవాడలో జరిగిన సిగాచి పరిశ్రమ పేలుళ్ల ఘటనలో హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనలో 54 మంది మృతి చెందగా, 28 మంది గాయపడ్డారని, 8 మంది ఆచూకి ఇంకా లభించలేదంటూ కె. బాబురావు అనే వ్యక్తి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. సిగాచి పరిశ్రమ సరైన రక్షణా చర్యలు తీసుకోకపోవడంతోనే ఈ ఘటన జరిగిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. పిటిషనర్ తరపున న్యాయవాది వాదనలు వినిపిస్తూ%ౌ%ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా పరిశ్రమల్లో భద్రతా చర్యలు ఉండాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలన్నారు. ఈ కేసును ప్రత్యేక దర్యాప్తు బృందంతో దర్యాప్తు చేయించాలన్నారు. ఇప్పటి వరకు మృతుల ఆచూకీ లేని వాళ్ల కుటుంబాలకు, గాయపడిన వారికి ప్రకటించిన పరిహారం చెల్లించలేదని తెలిపారు. పరిశ్రమ యాజమాన్యంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, పరిశ్రమలో పేలుడుకు గల కారణాలపై ఏర్పాటు చేసిన కమిటీ నివేదికను బయట పెట్టాలని వాదించారు. దీంతో ఈ పిటిషన్‌పై మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఉన్నత ధర్మాసనం ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది. అనంతరం ధర్మాసనం కేసును వాయిదా వేసింది.

## తిరుమల పవిత్రతకు భంగం కలిగించే వీడియోలపై టీటీడీ హెచ్చరిక

### మాడ వీధుల్లో నృత్యాలు, వెకిలి చేష్టలతో రీల్స్ చేస్తే కఠిన చర్యలు

**బలగం టీవి,తిరుమల**

తిరుమల శ్రీవారి ఆలయం పరిసరాల్లో సామాజిక మాధ్యమాల కోసం అసభ్య రీతిలో రీల్స్ చిత్రీకరిస్తున్న ఘటనలపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆలయం ముందు, మాడ వీధుల్లో వెకిలి చేష్టలు, నృత్య ప్రదర్శనలు చేస్తూ వీడియోలు రూపొందించి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేస్తున్నారని టీటీడీ పేర్కొంది. ఈ తరహా చర్యలు తిరుమల క్షేత్ర పవిత్రతకు భంగం కలిగించేలా ఉన్నాయని, భక్తుల మనోభావాలను బాధపెట్టేలా ఉన్నాయని అధికారులు హెచ్చరించారు. తిరుమల ఆధ్యాత్మికతకు ప్రతీక అయిన క్షేత్రమై భక్తి, భయం లేకుండా వ్యవహరించడాన్ని సహించబోమని స్పష్టం చేశారు.

**వీడియోలు చిత్రీకరిస్తే చట్టపరమైన చర్యలు**

ఇలాంటి చర్యలు మళ్లీ పునరావృతం కాకుండా టీటీడీ విజిలెన్స్, సెక్యూరిటీ విభాగాలు సీసీ కెమెరాల ద్వారా గట్టి నిఘా పెట్టాయని అధికారులు తెలిపారు. రీల్స్ కోసం అసభ్యంగా ప్రవర్తించే వారిపై కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. "తిరుమల భక్తి కేంద్రంగా నిలవాలి. ఇక్కడ సామాజిక మాధ్యమాల కోసం వెకిలితనానికి చోటు లేదు. భక్తులు తమ ప్రవర్తనతో పవిత్రతను పరిరక్షించాలి" అని టీటీడీ అధికార ప్రతినిధి ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## మూడు నెలల్లో తేల్చాలి

**(మొదటి పేజీ తరువాయి)**

అలాగే అనర్హత పిటిషన్లను ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల విచారణను పొడగించడానికి అనుమతించవద్దని స్పీకర్‌ను ధర్మాసనం ఆదేశించింది. ఇక స్పీకర్‌లు అనర్హత పిటిషన్లను ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉంచే పరిస్థితిని రాజ్యాంగ ధర్మాసనం ఊహించి ఉండకపోవచ్చున్నారు. అంతేకాకుండా అనర్హత పిటిషన్లను స్పీకర్ మూడు నెలల్లోగా నిర్ణయించాలని కీషమ్ మేఘచంద్ర సింఘ్ కేసులో ఇచ్చిన తీర్పును గుర్తు చేశారు. శివసేన, ఎన్‌సీపీ ఎమ్మెల్యేల ఫిరాయింపుల పిటిషన్లను నిర్ణీత సమయంలోగా నిర్ణయించాలని మహారాష్ట్ర స్పీకర్‌కు జారీ చేసిన ఆదేశాలను కూడా కోర్టు పరిగణనలోకి తీసుకుందని సీజేఐ తీర్పులో పొందుపరిచారు.

అనర్హత విషయంలో స్పీకర్ నిర్ణయాధికారాన్ని పార్లమెంట్ పున: పరిశీలించాలని సీజేఐ ధర్మాసనం సూచించింది. తీర్పు ఆరంభంలో రాజ్యాంగంలోని 52వ సవరణలో భాగంగా తెచ్చిన ఫిరాయింపుల నిరోధక చట్టం(యాంటి డిఫెక్షన్ లా)లోని అంశాలు, అభ్యంతరాలను సీజేఐ ప్రస్తావించారు. 'రాజకీయ ఫిరాయింపులు జాతీయ ఆందోళనకు సంబంధించిన అంశం. దీనిని ఎదుర్కోకపోతే... మన ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది' అని అన్నారు. న్యాయస్థానాల్లో ఆలస్యం, అసెంబ్లీ పదవి కాలం ముగిసేలోపు అనర్హత పిటిషన్లపై త్వరితగతిన నిర్ణయాలు తీసుకునేందుకే స్పీకర్‌కు నిర్ణయాధికారం ఇచ్చినట్టు అభిప్రాయపడ్డారు.అయితే అనర్హత పిటిషన్లను నిర్ణయించడానికి స్పీకర్/చైర్మెన్‌కు అప్పగించే ప్రస్తుత యంత్రాంగం.. రాజకీయ ఫిరాయింపుల ముప్పును అరికట్టడానికి అనుకూలంగా ఉందో లేదో పున: పరిశీలించాలని ధర్మాసనం పార్లమెంట్‌ను కోరింది.

## భూముల పరిరక్షణకు అత్యవసర చర్యలు

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రత్యేక సీనియర్ న్యాయవాదిని నియమించనున్నట్లు ఆయన వెల్లడించారు.

కోటానుకోట్ల విలువ చేసే భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు గాను నీటిపారుదల శాఖ హైడ్రా,రెవిన్యూ,ఆర్ అండ్ఆర్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. అదే విదంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నీటిపారుదల శాఖ భూములను సత్వరం గుర్తించాలని ఆయన నీటిపారుదల శాఖాధికారులకు సూచించారు

అంతే గాకుండా నీటిపారుదల క్వార్టర్స్ లో అక్రమంగా ఆక్రమించుకున్న వారిని తొలగించడం తో పాటు తక్షణమే వాటి సమగ్ర సమాచారం తన ముందుంచాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

నీటిపారుదల శాఖకు చెందిన అంగుళం భూమిని కుడా ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు.భవిష్యత్ లోనూ ఆక్రమణలకు చోటు లేకుండా పరిపాలనా పరంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.తద్వారా ఆక్రమణలకు చెక్ పెట్టొచ్చని ఆయన సూచించారు. దానికి తోడు రాష్ట్ర వ్యాప్తంగా నీటిపారుదల కాలువల పక్కన ఉన్న భూముల్లో ,ప్రాజెక్టులకు చెందిన భూములలో సౌర విద్యుత్ ప్లాంట్ ల ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని ఆయన అధికారులను ఆదేశించారు.



## క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు

**బలగం టివి, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని జగ్గారావుపల్లి గ్రామంలో క్షయ వ్యాధిపై అవగాహన,టీబీ ముక్త్ భారత్ అభియాన్ ద్వారా మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్య అధికారి డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో నిర్వహించారు.

అనంతరం డాక్టర్ శిరీష మాట్లాడుతూ షుగర్, క్యాన్సర్, బీపీ, దీర్ఘకాళికా వ్యాధులు, పొగ తీసుకునే వారిలో క్షయ వ్యాధికి గురయ్యే అవకాశం ఎక్కువగా ఉన్నాయని, క్షయ లక్షణాలు రెండు వారలకు మించి దగ్గు జ్వరం, ఆకలి లేకపోవడం, రాత్రిపూట చెమటలు పట్టడం,బరువు తగ్గడం ఉన్నవారు తేమడ పరీక్షలు చేయించుకోవాల్సిందిగా సూచించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ నిర్వహించిన కార్యక్రమంలో 78 మంది కి పైగా టీబీ స్క్రీనింగ్ చేశామని,15 మంది అనుమానితుల నుండి తేమడ నమూనాలను సేకరించి ల్యాబ్ కు పంపించమన్నారు. 06 మంది సింటామెటిక్ వాళ్ళని ఎక్సరే సిరిసిల్ల మెడికల్ కాలేజీ రేడియోలాజి ల్యాబ్ కి పంపించామని, అందులో క్షయ వ్యాధి నిర్ధారణ అయిన వారికీ 6 నెలల పాటు పూర్తి ఉచితంగా పరీక్షలు, మందులు ఇస్తామన్నారు. అలాగే నిక్షయ్ పోషన్ ద్వారా వ్యాధిగ్రస్థులకు నెలకి1000/- రూపాయలు పౌష్టికహారం కోసం ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు అరవింద్, కృప, (ఎస్టి..ఎస్) గంగాధర్, ల్యాబ్ టెక్నీషియన్ ప్రకాష్, ఆరోగ్య కార్యకర్త పద్మ, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## దాచారం పాఠశాలలో మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండలంలోని దాచారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో విద్యార్థిని విద్యార్థులకు లిమిషన్ పరివర్తన మరియు నషా ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా మాదక ద్రవ్యాల వినియోగం నియంత్రణ పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ ఎడ్యుకేటర్ మంద జనార్ధన్ మాట్లాడుతూ మాదకద్రవధ్యాలు మత్తుపదార్థాల వాడకం వలన శారీరక, మానసిక ఆరోగ్యాన్ని బలహీనపరచడంతో పాటు కుటుంబం, సమాజం, దేశ అభివృద్ధికి కూడా పెద్ద అడ్డంకిగా మారతాయి. విద్యార్థిని విద్యార్థులు ఈ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తమ లక్ష్యాలను తెలుసుకొని, సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలి," అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాణి, ఉపాధ్యాయులు తూముకుంట నరేందర్ రెడ్డి, దావీద్, సంజీవ్,మరియు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న స్థలాల పరిశీలన

**బలగం టివి, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్లా నుండి కరీంనగర్ వెళ్లే దారిలో వేములవాడ మండలం నాంపల్లి రుద్రవరం,ఆరేపల్లి కూడలిలో బోయినిపల్లి మండలం కొదురుపాక కూడలి, వెంకట్రావుపల్లి వంతెన వరకు ఉన్న ప్రమాదలు, సంభవించే రోడ్డును అధికారులు తనిఖీ చేశారు. ప్రమాదాలు జరిగే రోడ్డుపైన రంబుల్ స్ట్రిప్, స్టడ్స్ లైట్స్ మరియూ సోలార్ లైట్లు అజార్డ్ మార్కర్స్ వేగ నియంత్రణకు అమర్చుటకై స్థలాలను ఎంపిక చేశారు. ఇందులో జిల్లా రవాణాశాఖ అధికారి లక్ష్మణ్ మోటార్ వాహన తనిఖీ అధికారి వంశీధర్ మరియు జిల్లా రవాణా శాఖ సభ్యులు సంగీతం శ్రీనాథ్ ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్ రాజు సిరిసిల్ల వేములవాడ రహదారి మరియు భవనాల అధికారులు డిప్యూటీ ఇంజనీరు శాంతయ్య, వరప్రసాద్ ఏ.ఈ.ఈ నవ్య మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే లక్ష్యంగా ఇందిరమ్మ పాలన..

**-మహిళలు ఆర్థికంగా ఎదిగి ఆత్మగౌరవంతో జీవించాలి..**

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవి,గంభీరావుపేట**



ఇండియా అంటే ఇందిరా, ఇందిరా అంటే ఇండియా ప్రపంచం కొనియాడేలా ఇందిరమ్మ పాలన చేసిందని, అదే ఏజెండాతో ఇందిరమ్మ పాలన రాష్ట్రంలో కొనసాగుతుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు గురువారం గంభీరావు పేట మండలం లింగన్న పేట గ్రామంలో శ్రీ షిర్డీ సాయిబాబా గ్రామ సమాఖ్య మహిళా సంఘం ద్వారా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, కేకే మహేందర్ రెడ్డి లతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా సంఘాల ద్వారా నడిపే 3వ పెట్రోల్ బంక్ ప్రారంభించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. . ఇందిరాగాంధీ బ్యాంకుల జాతీయకరణం, గరిబీ హఠావో నినాధంతో ప్రత్యేక కార్యక్రమాలు, కూడు,గుడు,గుడ్డ అమలు, దళితులకు భూ పంపిణీ వంటి అనేక కార్యక్రమాలను అమలు చేసిందని,పేద ప్రజల, మిడిల్ క్లాస్ ప్రజల మనోభావాలను గౌరవిస్తూ వారి అభ్యున్నతికి పని ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు.

గత పాలకులు ప్రజల ప్రయోజనాలు పట్టించుకోలేదని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తమ హయాంలో నిర్మించిన శ్రీరాంసాగర్, మానేర్, నాగార్జున సాగర్, కడెం, ఎల్లంపల్లి వంటి ప్రాజెక్టులు నేటికి ప్రజలకు సేవలు అందిస్తున్నాయని అన్నారు. రైతును రాజు చేసేందుకు ఉచిత విద్యుత్ వంటి అనేక పథకాలను ప్రారంభించామని అన్నారు.

మహిళలకు వడ్డి లేని రుణాలు పథకం ప్రారంభించి రెండు సార్లు ఇప్పటికే చెల్లింపులు చేశామని అన్నారు. గత పాలకులు వడ్డీ లేని రుణాల లబ్ది మహిళలకు ఎగొట్టిందని ఆయన విమర్శించారు. మహిళా సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఐకేపి ద్వారా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. మహిళలను కోటీశ్వరులు చేయాలని లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. మొదటి సంవత్సరం 21 వేల కోట్ల రూపాయలు వడ్డీ లేని రుణాలు మహిళా సంఘాలకు అందించడంతో పాటు లోన్ బీమా, ప్రమాద బీమా వంటి పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు.

మహిళల ఆదాయం పెంచెందుకు స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, పాడి పశువుల పెంపకం, ఇందిరా శక్తి క్యాంటీన్, ఆర్టిసి కు అద్దె బస్సులు, పాఠశాలలకు ఏకరూప దుస్తులు కుట్టడం వంటి అనేక మార్గాలను అన్వేషిస్తున్నామని అన్నారు. ఆర్థికంగా అనేక కష్టాలు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో 93 లక్షల పేద కుటుంబాలకు రాష్ట్రంలో సన్న బియ్యం రేషన్ కార్డు ద్వారా సరఫరా చేస్తున్నామని, అర్హులైన పేదలకు నూతన రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్నామని అన్నారు. 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు.

కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ మన జిల్లాలో ఒక పెట్రోల్ బంక్ దివ్యాంగుల ద్వారా ఏర్పాటు చేశామని, ప్రస్తుతం మహిళా సంఘాల ద్వారా మరో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. మహిళా సంఘాల ద్వారా నడిపే పెట్రోల్ బంక్ ముఖ్యమంత్రి చేతుల మీదుగా నారాయణ పేట జిల్లాలో మొదటి సారి ప్రారంభిఝచారని, అనంతరం సంగారెడ్డి జిల్లాలో పెట్రోల్ బంక్ ఏర్పాటైందని, రాష్ట్రంలో మహిళా సంఘాల ద్వారా నడిచే 3వ పెట్రోల్ బంక్ సిరిసిల్ల జిల్లాలో ప్రారంభించామని అన్నారు. రాబోయే 3 నెలలో మహిళా సంఘాల ద్వారా మరో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. పెట్రోల్ బంక్ ద్వారా లక్షల రూపాయల ఆదాయం వస్తుందని, ఆ నిధులను రివాల్వింగ్ ఫండ్ లో పెట్టి బాగా వినియోగించుకోవాలని అన్నారు. మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ ను త్వరగా పూర్తి చేయడంలో కృషి చేసిన అధికారులు, సిబ్బంది కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ ఆదికారి లక్ష్మీ రాజం, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ లక్ష్మి, స్థానిక నాయకులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## గురుకులాల సమస్యలపై అంబేద్కర్ విగ్రహానికి వినతి

**-కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇప్పటికే 95 మంది మృతి**

**-కంచర్ల రవి గౌడ్ ఆవేదన**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**

తెలంగాణలోని గురుకుల పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ కారణంగా విద్యార్థులు ఆసుపత్రి పాలవుతున్న ఘటనలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు 95 మంది విద్యార్థులు మరణించారని, ఈ సమస్యపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని విద్యార్థులు, నాయకులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో, గురుకుల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించారు. తొలి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు నాయకత్వంలో గురుకుల వ్యవస్థ ప్రతిష్టాత్మకంగా ఉండేదని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ వ్యవస్థ దారుణ స్థితికి చేరుకుందని నిరసనకారులు విమర్శించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గురుకుల పాఠశాలలకు పంపేందుకు భయపడే పరిస్థితి ఏర్పడిందని, విద్యార్థుల గోడు ప్రభుత్వానికి కనిపించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

"తరగతి గదుల్లో చదువుకోవాల్సిన విద్యార్థులు నడిరోడ్డుపై నిరసనకు దిగడం బాధాకరం. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం," అని వినతిపత్రంలో పేర్కొన్నారు. అంతేకాక, "ముఖ్యమంత్రి గారికి కలలో అంబేద్కర్ గారు కనిపించి, విద్యార్థుల సమస్యలను పరిష్కరించమని బోధించాలని" విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు వడ్లూరి సాయికిరణ్, ముధం అనిల్ గౌడ్, ఎస్.కె. అప్రోచ్, హరీష్, జోయల్, శివ, రాకేష్, కృష్ణ, వంశీ, రోహిత్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ కన్నుమూత

**బలగం టీవీ, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం బూరుగుపల్లి గ్రామ సర్పంచ్ రాజకీయ యోధుడు అతికం లచ్చయ్య కన్నుమూశారు.ఆయన మృతి వార్త విన్న పలువురు సన్నిహితులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్టీఆర్ స్ఫూర్తితో 1982లో రాజకీయాల్లోకి వచ్చిన అతికం లచ్చయ్య తెలుగు దేశంలో ఎన్నో పదవులు అలంకరించారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లా తెలుగు దేశం పార్టీ కార్యదర్శిగా పనిచేశారు.సిరిసిల్ల ఎమ్మెల్యే చెన్నమనేని రాజేశ్వరావు ప్రధాన అనుచరుడిగా గుర్తింపు తెచ్చుకుని,బోయినిపల్లి మండలంలోని పలు గ్రామాలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నో సేవా కార్యక్రమాలు, సేవ్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. పలు గ్రామాలలో సేవ్స్ ఆధ్వర్యంలో ఫిల్టర్ వాటర్ కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రజలకు చాలా మేలు చేశారు. తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులుగా కొన్ని ఏళ్లు పార్టీకి సేవ చేశారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి రాష్ట్ర హెూం మంత్రి తూల్ల దేవేందర్ గౌడ్,ఇతర మంత్రులు కడియం శ్రీహరి,ఎర్రబెల్లి దయాకర్ రావు, సుద్దాల దేవయ్యలకు అత్యంత సన్నిహితంగా మెలిగారు. పార్టీ కోసం ఎంతో గాను నిబద్ధతతో పనిచేశారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో చురుకుగా పాల్గొన్నారు. అనుక్షణం బూరుగుపల్లి గ్రామ అభివృద్ధికి ఎంతో గాను కృషి చేశారు. నాటి బి.ఆర్.ఎస్ ప్రభుత్వంలో సర్పంచ్ గా గెలిచిన తర్వాత బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు అమిత్ రావు సూచనలతో బి.ఆర్.ఎస్ లో చేరి, గ్రామ అభివృద్ధికి ఎన్నో నిధులు తెచ్చి కృషి చేశారు.

# కుప్పకూలిన టాప్ ఆర్డర్

- వర్షం అంతరాయం.. వరుసగా వికెట్లు కోల్పోయిన టీమిండియా
- తొలి రోజు ముగిసే సరికి 204/6 స్కోరుతో నిలిచిన భారత్



**బలగం టీవీ, లండన్**

ఇంగ్లండ్‌తో ఐదవ టెస్ట్‌ను భారత క్రికెట్ జట్టు నిరాశజనకంగా ప్రారంభించింది. ఓవల్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో వర్షం అంతరాయంగా మారి ఆటకు వరుసగా అంతరాలు కలిగినప్పటికీ, భారత్ కీలకమైన వికెట్లు కోల్పోయింది. ఆట ముగిసే సమయానికి భారత్ 64 ఓవర్లలో 6 వికెట్లకు 204 పరుగులు చేసింది. కరుణ్ నాయర్ (52 బ్యాటింగ్), వాషింగ్టన్ సుందర్ (19 బ్యాటింగ్) కలిసి జట్టును నిలబెట్టారు.

వర్షం కారణంగా తొలి రోజు కేవలం 64 ఓవర్ల ఆటే జరగగలిగింది. ఓవర్‌కాస్ట్ వాతావరణం కారణంగా పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా లేకపోవడంతో, ఇంగ్లండ్ బౌలర్లు మంచి ఉపయోగం చేసుకున్నారు. గస్ అట్కిన్సన్, జోష్ టంగ్ చెరో రెండు వికెట్లు తీసుకోగా.. క్రిస్ వోక్స్ ఒక వికెట్ పడగొట్టాడు.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే గట్టి దెబ్బ తగిలింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (2), కేఎల్ రాహుల్ (14) తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. వర్షం కారణంగా ఆట నిలిచిన సమయంలో భారత్ 23 ఓవర్లలో 72/2 స్కోరుతో లంచ్‌కు వెళ్లింది.

గంట విరామం తర్వాత ఆట తిరిగి ప్రారంభమయ్యే సరికి శుభ్‌మన్ గిల్ (రనౌట్) లేని పరుగుకు వెళ్లి పెవిలియన్ చేరాడు. తద్వారా మూడో వికెట్‌కు నమోదైన 44 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. వెంటనే వర్షం వల్ల మరోసారి ఆటకు అంతరాయం కలగగా.. టీమిండియా 85/3తో మైదానం వీడింది. రెండు గంటల పాటు ఆట నిలిచిపోయింది.ఆఖరి సెషన్‌లో టీమిండియా వరుసగా మూడు కీలక వికెట్లు కోల్పోయింది. సాయి సుదర్శన్ (38), రవీంద్ర జడేజా (9), ధ్రువ్ జురెల్ (19)లందరూ తక్కువ స్కోరుకే వెనుదిరిగారు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన కరుణ్ నాయర్ కూలగా ఆడి 89 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేశాడు. వాషింగ్టన్ సుందర్‌తో కలిసి ఏడో వికెట్‌కు అజేయంగా 51 పరుగులు జోడించి భారత్‌ను 200 పరుగుల మార్క్ దాటి తీసుకెళ్లాడు. ఇంగ్లండ్ బౌలర్లలో గస్ అట్కిన్సన్ (2/31) జోష్ టంగ్ (2/47) తలా రెండు వికెట్లు తీయగా వోక్స్ ఒక వికెట్ తీశాడు.

# పీకేఎల్ 12వ సీజన్ షెడ్యూల్ విడుదల

- ఆగస్టు 29 నుంచి అక్టోబర్ 23 దాకా నాలుగు నగరాల్లో కబడ్డీ మజా
- వైజాగ్‌లో ఏడేళ్ల తర్వాత మళ్లీ మ్యాచ్‌లు
- ఓపెనింగ్ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ వర్సెస్ తమిళ్ తలైవాస్



**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. ఆగస్టు 29 నుంచి అక్టోబర్ 23 వరకు లీగ్ దశలో మ్యాచ్‌లు జరగనున్నట్లు పీకేఎల్ నిర్వాహకులు షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ మెగా టోర్నమెంట్ దేశవ్యాప్తంగా నాలుగు ప్రధాన నగరాల్లో అభిమానులకు కబడ్డీ రసాస్వాదన అందించనుంది. విశాఖపట్నం, జైపూర్, చెన్నై, ఢిల్లీ వేదికలుగా ఈ సీజన్ జరగనుంది.

**వైజాగ్‌లో మళ్లీ కబడ్డీ సంబరం:**

ఏడేళ్ల విరామం తర్వాత విశాఖపట్నం మళ్లీ పీకేఎల్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 11 వరకు మ్యాచులు అక్కడ జరగనున్నాయి. అనంతరం జైపూర్ (సెప్టెంబర్ 12–28), చెన్నై (సెప్టెంబర్ 29– అక్టోబర్ 12), ఢిల్లీ (అక్టోబర్ 13–23) వేదికలుగా మ్యాచ్‌లు జరగనున్నాయి. ప్లేఆఫ్స్ షెడ్యూల్‌ను త్వరలో ప్రకటించనున్నారు.

**ఓపెనింగ్ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ పోరు**

ఆగస్టు 29న టోర్నీ తెలుగు టైటాన్స్ తమిళ్ తలైవాస్ మ్యాచ్‌తో అధికారికంగా ప్రారంభం కానుంది. ఇక డిఫెండింగ్ చాంపియన్స్ హర్యానా స్టీలర్స్ తమ టైటిల్ డిఫెన్స్‌ను ఆగస్టు 31న బెంగాల్ వారియర్స్‌తో జరగనున్న మ్యాచ్‌తో మొదలుపెట్టనున్నారు.

# మకావు ఓపెన్‌లో తరుణ్ సంచలనం

- చైనీస్ షట్లర్ లీ చెక్ యిపై సంచలన విజయంతో సూపర్ 300 టోర్నీలో రెండోసారి క్వార్టర్స్ చేరిన హైదరాబాదీ
- లక్ష్యసేన్, సాత్విక్-చిరాగ్ జోడీ కూడా క్వార్టర్స్‌లోకి



**బలగం టీవీ, న్యూఢిల్లీ**

చైనా వేదికగా జరుగుతున్న మకావు ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో హైదరాబాదీ యువ షట్లర్ తరుణ్ మన్నేపల్లి శక్తి ప్రదర్శించాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 15వ ర్యాంకర్, టాప్‌సీడ్ లిలిలీ చెక్ యి (చైనా)లిలిపై అద్భుత విజయం సాధించి క్వార్టర్ ఫైనల్ బరిలోకి దూసుకెళ్లాడు. మూడుసెట్ల గట్టిపోటీలో తరుణ్ 19–21, 21–14, 22–20 తేడాతో విజయం సాధించాడు. మొదటి గేమ్ ఓడినప్పటికీ, తదుపరి గేమ్‌లలో ప్రత్యర్థిని కోలుకునే అవకాశం లేకుండా చేశాడు. తరుణ్ కెరీర్‌లో ఇది రెండోసారి సూపర్ 300 టోర్నీలో క్వార్టర్స్ చేరడం. గత సంవత్సరం జర్మన్ ఓపెన్‌లో ఇదే ఘనత సాధించాడు.

క్వార్టర్ ఫైనల్లో తరుణ్ చైనాకు చెందిన హు జె అన్ (ప్రపంచ ర్యాంక్ 87) ను ఢీకొననున్నాడు. మరోవైపు, భారత నెంబర్‌వన్ షట్లర్ లక్ష్యసేన్ కూడా మంచి ఫామ్ చూపించాడు. లిలిచికో వర్డొయొ (ఇండోనేషియా)పై 21–14, 14–21, 21–17తో విజయం సాధించాడు.

పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్ – చిరాగ్ శెట్టి జోడీ జపాన్ జోడీ కుమగై–నిషిపై 10–21, 22–20, 21–16 తేడాతో గెలిచి క్వార్టర్స్ చేరింది. మరోవైపు, సింగిల్స్ కేటగిరీలో అయూష్ శెట్టి ప్రయాణం ప్రిక్వార్టర్స్‌లో ముగిసింది. మహిళల సింగిల్స్‌లో భారత షట్లర్ రక్షిత రామ్‌రాజ్ పోరాటం విఫలమైంది. ఆమె బుసానన్ ఆంగ్‌బమ్రుంగ్ఫన్ (థాయిలాండ్) చేతిలో 21–14, 10–21, 11–21 తేడాతో ఓటమిపాలైంది.




# వార్ 2 నుంచి ' రొమాంటిక్ సాంగ్

- 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న స్పై యాక్షన్ ఎంటర్‌టైనర్
- తెలుగు పాటకు చంద్రబోస్ లిరిక్స్-శాశ్వత్ సింగ్, నిఖితా గాంధీ స్వరాలిస్తూ

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ మరియు టాలీవుడ్ యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న భారీ చిత్రం వార్ 2 నుంచి మరో మ్యూజికల్ అప్‌డేట్ వచ్చేసింది. యశ్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ స్పై యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో కియారా అద్వానీ కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రం ఆగస్ట్ 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో, ప్రమోషనల్ కంటెంట్‌ను మేకర్స్ రిలీజ్ చేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు విశేష స్పందన లభించగా, తాజాగా విడుదల చేసిన 'ఊపిరి ఊయలగా' అనే రొమాంటిక్ సాంగ్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ పాటలో హృతిక్ మరియు కియారా మధ్య రొమాంటిక్ కెమిస్ట్రీను అద్భుతంగా చూపించారు. రిచ్ విజువల్స్, శృతిమధురమైన సంగీతం ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది. తెలుగు వెర్షన్‌కు ప్రముఖ గీతరచయిత చంద్రబోస్ సాహిత్యాన్ని అందించగా, గాయకులు శాశ్వత్ సింగ్ మరియు నిఖితా గాంధీ గానం చేశారు. ఈ పాటకు యూత్‌లో మంచి రెస్పాన్స్ వస్తోంది.



# గొప్ప మనసు చాటుకున్న సోనూసూద్

- పుట్టినరోజు సందర్భంగా వృద్ధాశ్రమానికి శ్రీకారం
- ఆశ్రయం, వైద్య సేవలు, పోషకాహారం అందించనున్న రియల్ హీరో

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

సమాజం కోసం తన సేవలతో దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందిన నటుడు సోనూసూద్ మరోసారి తన మానవతా హృదయాన్ని చాటుకున్నారు. నిన్న (జూలై 30) 52వ పుట్టినరోజు సందర్భంగా ఆయన ఓ వృద్ధాశ్రయాన్ని స్థాపించనున్నట్టు ప్రకటించారు. ఇందులో 500 మంది వృద్ధులకు ఆశ్రయం కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ వృద్ధాశ్రయంలో వృద్ధులకు కేవలం వసతి కల్పించడమే కాకుండా, వైద్య సంరక్షణ, పోషకాహారం, మానసిక బలాన్నిచ్చే కార్యక్రమాలు కూడా ఉండనున్నాయని సోనూసూద్ తెలిపారు. కుటుంబం లేని వృద్ధులు సురక్షితంగా జీవించేందుకు ఇది ఒక చిరస్థాయి కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు. సోనూసూద్ ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాలతో రియల్ హీరోగా గుర్తింపు పొందారు. కరోనా మహమ్మారి సమయంలో వలస కార్మికులకు సాయం చేసిన విధానం దేశవ్యాప్తంగా ప్రశంసలందుకుంది. ఆ సమయంలో ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం, ఆహారం, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ అనేకమందికి ఆదరణగా నిలిచారు. ఇప్పుడు వృద్ధుల కోసం ఆయన చేపట్టిన ఈ సేవా ప్రాజెక్టుపై మళ్లీ సోషల్ మీడియాలో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. "వయోవృద్ధులకు ఇది నిజమై న ఆశ్రయం", "సోనూసూద్‌కి జన్మదిన శుభాకాం క్షలు మాత్రమే కాదు, మనఊరు నీ సేవల్ని గర్విస్తుంది" అంటూ నెటిజన్లు అభినందనలు తెలుపుతున్నారు.

# వెంకన్న స్వామి ఆశీస్సులు, అభిమానుల ప్రేమ వల్లే విజయం



**బలగం టీవీ, న్యూఢిల్లీ**

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'కింగ్డమ్' ప్రేక్షకుల మనసు దోచుకుంటోంది. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ నిర్మించారు. గురువారం విడుదలైన ఈ సినిమా యూఎస్ ప్రీమియర్ల నుంచే పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. దీంతో చిత్రబృందం విజయం సందర్భంగా ప్రత్యేక మీడియా సమావేశం నిర్వహించి తమ ఆనందాన్ని పంచుకుంది.విజయ్ దేవరకొండ స్పందిస్తూ "వెంకన్న స్వామి ఆశీస్సులు, అభిమానుల ప్రేమ వల్లే ఈ విజయం సాధ్యమైంది. చాలా మంది ఫోన్ చేసి 'అన్నా మనం హిట్ కొట్టినం' అంటూ ఎమోషనల్‌గా ఫీలవుతుండటం చూసి గర్వంగా ఉంది. ఈ విజయాన్ని ప్రేక్షకుల మధ్యే సెలబ్రేట్ చేసుకుంటాను. త్వరలో తెలుగు ప్రేక్షకులతో పాటు యూఎస్‌లో ఉన్నవారిని కూడా కలవబోతున్నా" అని తెలిపారు.సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ "చిత్రానికి మేము అనుకున్న విధంగానే స్పందన వస్తోంది. సాంకేతికంగా హాలీవుడ్ స్థాయిలో తీర్చిదిద్దిన ఈ చిత్రం ద్వారా విజయ్ హిట్ కొట్టడం చాలా సంతోషంగా ఉంది" అని చెప్పారు. నటుడు సత్యదేవ్ కూడా తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ "విజయ్ గెలిస్తే, అది మా అందరి గెలుపే. తన లాంటి యువ నటుడు ఈ స్థాయికి చేరడం ఎంతో మందికి ప్రేరణ" అని అన్నారు.